
# పొగడరా నీతల్లి భూమి భారతిని.....

బీనాదేవి



ఆ వెడల్పైన కాంక్రీటు రోడ్డుమీద అడ్డంగా హాకీ ఆడుకోవచ్చును. నల్ల చెరువులా ఉన్న ఆ కాంక్రీటు రోడ్డు మధ్య కార్పొరేషన్‌వాళ్ళు ఈ మధ్యనే వేసిన ఎర్రతురాయిచెట్లు ముడుచుకుపోతున్న కమలాల్లా ఉన్నాయి.

రోడ్డుకు అటూ యిటూ పేవ్‌మెంట్ల మీద తెగబలిసిన చింత చెట్లు సిమెంటు చెట్లలా ఉన్నాయి.

ఆ రోడ్డుమధ్య ఉన్న ట్యూబులైట్లు వెలుగొౘ్చిన మంచుకడ్డీల్లా ఉన్నాయి. ఆ వీధి దేవతలుకట్టుకున్నహాలీడే రిజార్టులాఉంది.

ఆ వీధిలో ఒక్క హోటలూ లేదు. కాని ప్రతియింటిలోను ఏర్‌కండిషనింగ్‌తో సహా ఫైవ్‌స్టార్ హోటల్ కుండే అన్ని సౌకర్యాలూ వున్నాయి.

ఆ వీధిలో ఒక్క బార్ కూడా లేదు. కాని ప్రతి ఇంటిలో ఒక మినీ బార్ ఉంది.

ఆ వీధిలో ఒక్క హాస్పిటలూ లేదు. కాని పదిమంది స్పెషలిష్టు డాక్టర్లు ఉన్నారు.

ఆ వీధి వాసులు జబ్బు చేస్తే హాస్పిటల్‌కు వెళ్ళరు.

హాస్పిటలే వాళ్ళ ఇంటికి వస్తుంది.

ఆ వీధిలో అన్ని ఇళ్ళూ రమారమీ ఒకే లాగ వున్నాయి.

సమయం ఎనిమిది గంటల ఆరు నిమిషాలు.

తీసివున్న గేటులోంచి పదమూడవ నెంబరు ఇంటివేపు నడిచి వెళ్ళింది చేతిలో పసిబిడ్డ నెత్తుకున్న ఒకావిడ.

ఆవిడకి పాతికేళ్ళుండొచ్చు.

చీకట్లో కూడా ఆమె కళ్ళు మెరుస్తూనే వున్నాయి.

నూనె రాయని ఆమె జుత్తు రేగి వుంది.

ఆమె సన్నగానే వుంది.

మొహం కోలగానే వుంది.

ఆమె కళ్ళు చేరడేసే వున్నాయి.

ఆమె కనుబొమలు విల్లులాగే వున్నాయి.

పెదిమలు దిద్దినట్టే వున్నాయి.

నవ్వినప్పుడు ఆమె చెంపలకు అందమైన సొట్టలే పడతాయి.

*మన దేశంలో వున్న దారిద్ర్యంముందు మనలో కొందరు ప్రదర్శించే భోగలాలసత వికృతరూపం- భరింపరానిది!*

ఆమె పళ్ళు ముత్యాల కోవల్లాగే వున్నాయి.

ఆమె —

వెన్నెల బొమ్మలా వుంది.

వెలుతురు కొమ్మలా వుంది.

వెండి తీగకు పూసిన బంగారు పువ్వులా వుంది.

ఆమె ఎత్తుకున్న పసిపిలకి ఆరు నెలలుండొచ్చు.

సైన్యం ఎదురొచ్చినా సరే తనక్కావల్సింది సాధిస్తానన్న ఆత్మ విశ్వాసంతో నడుస్తోంది ఆమె.

ఆపలేని ఆవేశాన్ని బైటకు రాకుండా అన్నట్టు పళ్ళు బిగబట్టి నడుస్తోంది.

"ఇప్పటికి నీకు జరిగిన అన్యాయం చాలు - మరింక జరక్కూడదు" అన్నట్టు తనెత్తుకున్న బిడ్డవేపు క్షణం చూసి, మళ్ళీ నడక ప్రారంభించింది.

తనకు అడ్డు తగిలితే పులినైనా గుద్ది చంపెయ్యగలనన్న ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది ఆమెలో.

అరక్షణం ఆగి మళ్ళీ బిడ్డవేపు చూసింది.

కోపంతో కాలిపోతున్న మనిషిలా ఎర్రగా అయిపోయింది.

ఆమె ఊపిరికి నిప్పంటుకున్నట్టుంది.

కోపంతో పెదిమలే కాక ఒళ్ళంతా వణక సాగింది.

తనకే తన బిడ్డకీ అన్యాయం చేసినవాడు కనిపిస్తే వట్టి చేతుల్తోనే కడుపుచీల్చి పేగులు మెళ్ళో వేసుకోవాలనుకున్నట్టుంది.

రమ్మ. చదువరీ. మనముకూడా ఆ 13 వ నెంబరు ఇంట్లో ప్రవేశిద్దాం.

ఆ కాంపౌండు గోడలో మ్యూజికల్ నోట్సు డిజైనుతో రెండు ఇనుపగేట్లు ఉన్నాయి. గేటుకీ, గేటుకీ, మధ్య అరమైలు దూరం ఉంటుంది.

గోడనానుకొని పెను ఏనుగుల కాళ్ళలా లేత కొబ్బరిచెట్లున్నాయి.

గేటుకి కుడివైపు కొత్త కేక్సులా మూడు గేరేజిలున్నాయి. ఆ గేరేజిల్లో ఒక దాన్లోదే ఇండియన్ కారు.

అర్ధ చంద్రాకారంతో ఈ గేటు నుంచి ఆ గేటు వరకు వున్న డ్రైవ్ పోర్టికోలో మెట్ల మార్బుల్ చెంపల్ని ముద్దుపెట్టుకుంటూ పోతుంది.

ఇంటి ముందున్న గార్డెన్‌తో ఒక పెద్ద పాలరంగు "పాండ్" వుంది.

"పాండ్" మధ్య నీళ్ళ మీద ఒక ఝార్బుల్ సుందరి నిటారుగా నిల్చుంది. ఆమె ఒంపులూ, సొంపులూ వుండవలసిన కంటె కాస్త జాస్తీగానే వున్నాయి. బట్టలు లేని ఆమె ఒక చేత్తో సిగ్గు కాపాడుకుంటోంది. నిటారుగా మీదికి ఎత్తిన రెండవ చేతిలోంచి పడుతున్న ఫౌంటెన్ నీళ్ళు తిరగేసిన వెండి కత్తిలా వున్నాయి.

ఆమె ఆరు రంగుల జౌత్‌కానా నీళ్ళలో స్నానం చేస్తోంది.

ఆ పాండ్‌లో బంగారు లేళ్ళకళ్ళు ఒలిచి పడేసినట్టున్నాయి చేపలు.

ఆ ఇంటి లాన్ ఆకుపచ్చని ఊలు రగ్గులా వుంటుంది.

లాన్ చుట్టూ అక్కడా అక్కడావున్న సిమెంటు బెంచీలు మంచు స్లాబ్సులా వున్నాయి.

ఆ ఇంటి బొట్ హౌస్ మీ ఊరి ట్రావెలర్స్ బంగళా అంత ఉంటుంది. ఆ ఇంటి బాత్రూమ్‌లు మీ బెడ్ రూములకంటె పెద్దవి.

ఆ ఇంటి వాళ్ళ అ్రారు సీసాలు మన ఆవ్రదం సీసాలంత ఉంటాయి. వాళ్ళ తువ్వాళ్ళు దుప్పట్లంత ఉంటాయి.

దుప్పట్లు కార్పెట్లంత ఉంటాయి.

ఆ ఇంటికి ఎడంవేపు స్విమ్మింగ్‌పూల్ ఉంది. అందులో డైవింగ్ కూడా చెయ్యొచ్చు.

ప్రస్తుతం స్ప్రింగు బోర్డుమీద ఒక రబ్బరు సుందరి నిలబడి వుంది. ఆమె తొడుక్కున్న బేతింగ్ సూట్ స్కిన్ కలరు వన్‌పీస్. ఆ సూట్ కిందివేపు తొడ నరదవరకు మాత్రం వుంది. పైన గుండెల సగం వరకు వుంది.

సాహితీపిపాసులకు
నూతన కానుకలు
యద్దనపూడి సులోచనారాణి...
యార్లగడ్డ సరోజినీదేవి
హరివిల్లు ...8.00
రాగబంధం ..8.00
గంటి వెంకటరమణి
డాక్టర్ వనిత...6.50
కొత్తొత్తి వెలిగింది ...6.50
ముప్పాళశెట్టి హనుమంతరావు
అనూరాధ ...6.50
మలుపు ...6.50
ఉన్నవ విజయలక్ష్మి
స్వయంవరం ..8.00
దాశరథి రంగాచార్య
మానవత 8.00
పసుపులేటి మల్లికార్జునరావు
స్నేహము-త్యాగము 8.00
నవయుగ
బుక్ సెంటర్
విజయవాడ-520002

## ఆహా! చిత్రం! విచిత్రం!!

"వై" అని పేరుగల ఒక గ్రామం ఫ్రెంచి దేశంలో ఉంది.

* * *

పాకెట్ గడియారాలను కనిపెట్టిన క్రొత్తలో అవి చాలా బరువుగా ఉండేవి. వాటిని మోయడానికి సేవకులను పెట్టుకునేవారు.

* * *

మెగ్నీషియమ్ కాలిన తరువాత మిగిలిన బూడిద లోహాని కన్నా బరువెక్కువగా ఉంటుంది.

* * *

ఇర్ వింగ్ టన్ నివాసి అయిన శ్రీమతి లూసిమాక్ ఆర్థర్ డిక్షనరిలో ముళ్ళమొక్క మొలిచిందట.

* * *

బాల్టిమోర్ నివాసి అయిన శ్రీమతి గ్రిసీ హప్పర్డ్ పెంచిన కోడి పెట్టిన గ్రుడ్డుకు వరుసగా తెల్లరంగులో, బ్రౌను రంగులో గీతలు వున్నాయట.

* * *

ఇంగ్లండులోని చిజిల్‌హర్స్ట్ నివాసి అయిన ఎర్నెస్ట్ జోన్స్ ఒంటికాలి వాడైనా పందొమ్మిది వందల పదహారో సంవత్సరం సెప్టెంబరులో డెభ్భైన్కోరుచేసి గోల్ఫ ఆటలో ప్రసిద్ధి కెక్కాడు.

* * *

పందొమ్మిదివందల నలభై తొమ్మిదిలో పారిస్‌లో ఒక దొంగ సర్కస్ కంపెనీలో నుంచి బంధింపబడిన సింహమున్న బోనును ఎత్తుకొనిపోయారు.

* * *

దక్షిణాఫ్రికా అడవుల్లోని వారు పూజ చేసేటప్పుడు వాడే మంత్రాలనే దేవునిగా కొల్చేవారు.

* * *

నలభై డిగ్రీల దగ్గర సెంటిగ్రేడ్, ఫారెన్ హీట్ ధర్మామీటరు ఏకీభవిస్తాయి.

* * *

పుల్లని తేనెను బ్రెజిల్‌లోని గోయాజ్ అనేఊళ్ళో కొండ లేని తేనెటీగలు తయారు చేస్తాయి.

సేకరణ: ఎన్. ఎం. లక్ష్మిదేవి

---

గుండెల మీద పల్లం కనిపించలేదు ఎప్పట ఆమె బేతింగ్ సూట్ వేసుకుందను కోవాలి లేకపోతే ఆమె ఒంటి మీద గుడ్డ లేనట్టే లెక్క. అంత సహజంగా వుంది ఆ స్కిన్ కలర్ సూట్.

స్విమ్మింగ్‌పూల్ గట్టున నిల్చున్న ముగ్గురు యువకులూ ధనికులే. ముగ్గురూ ఫుల్ సూట్లలోనే ఉన్నారు. ముగ్గురి చేతుల్లోను ఏవో గ్లాసులు వున్నాయి.

స్ప్రింగ్ బోర్డు మీది సుందరి నీట్లోకి గెంతింది. వెంటనే నీటి సుడిలోంచి జల సుందరిలా పైకి తేలింది. తేల్లబోయిన చేపకోసం కొంగలు చూసినట్టు ఆ ముగురు యువకులూ ఆత్రంగా చూసేరు. వాళ్ళు ముగ్గురూ ఆమెను పెళ్ళాడగల్చుకున్నవారే.

కాని ఆమె పెళ్ళాడదల్చిన 'రామూ' పగటిపూట గుమాస్తా పని చేసుకుంటూ, నైట్ కాలేజీలో ఎం. ఎ చదువుతున్నాడు. ఆ ఇల్లు ఆమె కుటుంబానిదే.

ఆ ఇంటి గదులన్నీ ఎయిర్ కండిషన్‌వి. బాత్ రూములు మార్బుల్‌వి.

వరండా పక్క మెయిన్ హాల్లో కెంపులూ, నీలాలూ కలిపి జరిపోగుల్తో నేసినట్టు రెండు చాండిలేర్స్ ఉన్నాయి. ఆ హాల్లో ఉన్న తెల్ల తివాసీ తెల్ల పులి తోలులా ఉంది

ఆ హాలు గోడలు కోవా రంగులో ఉన్నాయి

ఆ హాలు ద్వారాలోంచి జిరాఫీలు నడిచి వెళ్ళిపోవచ్చును

ఆ హాలుగోడల్ని వెంకటరమణమూర్తి, గాంధీగారు, ప్రస్తుత చీఫ్ మినిస్టరుగారు లైఫ్ సైజులో వేలాడుతున్నారు మరో గోడని ఎవరో ఫారినర్ వేసిన ఫారెస్ట్ సీను వేలాడుతోంది.

హాల్లో పార్టీ జరుగుతోంది. పార్టీలో పాతిక మొదలు అరవై ఏళ్ళవరకు ఆడ. మగ ఉన్నారు. వయసులో ఉన్న ఆడవాళ్లు సినిమా హీరోయిన్లలా ఉంటే. మిగతా ఆడవాళ్ళు వయసు ముదిరిన నాయికల్లా ఉన్నారు. కొందరి జుత్తు ఒత్తుగా ఉంటే. మరికొందరికి విగ్గులున్నాయి.

వయసులో ఉన్న మొగాళ్ళు గిరజాలు పెంచేరు. ఆడవాళ్లు బాబ్ చేయించుకున్నారు. వయసులోవున్న అందరు మొగవాళ్ళు, కొంతమంది ఆడవాళ్ళు. బెల్‌బాటమ్స్ తొడుక్కున్నారు. అంచేత వెనకనుంచి ఆడెవరో, మొగ ఎవరో చెప్పటం కష్టం అయితే కొంత మంది ఆడవాళ్ళని ముందు నుంచి పోల్చుకోవడం కూడా కష్టమే.

అందరు మొగాళ్ళూ సూట్లలో వున్నందు వల్లా, అందరి జుత్తు నల్లగానే - సహజ రంగు కొందరిదైతే, వేసుకున్నది కొందరిది - వుండడంవల్లా, దూరంనుంచి వాళ్ళ వయస్సులు వాళ్ళ బొజ్జల్ని పట్టి మాత్రమే చెప్పవచ్చు.

హాల్లో ఒక పెద్దటేబిలు మీద రకరకాల డ్రింకులు, టిఫిను, ఖాళీ ప్లేట్లు వున్నాయి, ఆ టిఫిన్లలో కొన్ని వెంట్రుకలు పీకేసిన కోళ్ళల్లా వున్నాయి.

సమయం - ఎనిమిది గంటల పది నిమిషాలు.

ఇంటి యజమాని కొడుకు లక్క పిపాయిలా వున్నవాడు, సోఫాలో తన పక్కనున్న బుగ్గలపిల్ల కళ్ళలోకి చూస్తూ "మరొక్కటి ప్లీజ్.... వన్ మోర్" అని బతిమాలుతూ ప్లేట్లో వున్న స్వీట్సు ఆమె నోటి కందిస్తున్నాడు.

"ఓహ్! నా. నా యూ నాటీ బోయ్" అని తలాడిస్తూనే నోరు తెరిచి అందుకుంటోంది ఆ బుగ్గలపిల్ల.

"బాబూ...." అంది వరండాలో కొచ్చిన ఆ పసిపిల్ల తల్లి గొంతుక.

"మర్యాదగా వెళ్తావా? జవాన్ల చేత ఈడిపించీమంటావా?"

"బాబూ....నాకోసం కాదు....ఈ పిల్లని చూసైనా...." ఆమె గొంతుక వణికింది.

ఆమె కంఠంలోని దైన్యానికి, దానవుడిలోకూడా దేవుడు మేల్కొంటాడు. దేవుడే ఉంటే దివినుంచి దిగి వచ్చేస్తాడు.

"ఒరేయ్" అరిచేడు అతను.

"అక్కర్లేదు బాబూ" అంటూ ఆమె చరచర వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న ఆమె గేటుదగ్గర ఒక్కక్షణంఆగి, వెనక్కి తిరిగి ఆ ఇంటి వేపు "ప్రపంచంలో న్యాయం అంటూ వుంటే. ఈ బంగళా మనుష్లుతో సహా తెల్లారేసరికి బుగ్గైపోవాలి" అన్నట్టు చూసింది.

రోడ్డు దాటి ఎదురుగా ఉన్నపార్కులో కొళాయి దగ్గర మొహం కడుక్కొని, పసిపిల్ల నోట్లో యిన్నినీళ్ళుపోసి, పచ్చికలో కూలబడి, అప్పుడే కళ్ళు తెరిచిన పిల్లని గుండెకి హత్తుకుంది.

ఎవరావిడ?

నాల్రోజుల్నుంచీ తిండిలేకపోయినా, నడవడానికి ఓపిక లేకపోయినా, నాక్కాదు బాబూ, ఆకలికి సొమ్మసిల్లిపోయిన ఈ పిల్లకి పడేయండి "బాబూ" అని కనిపించని దేవుడికి. కనిపించే మనుష్యులకి చేతులెత్తి దండం పెడుతున్న ఒక ముష్టిది. ★